ఎంఎల్ఎగా ఏం చేశారు

బాలరాజుపై కాంగ్రెస్ అభ్యర్థి సృజన ఆగ్రహం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పోలవరం నియోజకవర్గంలో ప్రజల సమస్యలను గాలికొదిలేసి ధనార్జనే ధ్యేయంగా పని చేసిన ఎంఎల్ఎ తెల్లం బాలరాజు సతీమణికి టిక్కెట్ కేటాయించడంతో ఆ పార్టీకి పతనం మొదలైందని పోలవరం కాంగ్రెస్ అభ్యర్థి దువ్వెల సృజన అన్నారు. గురువారం అంకాలగూడెంలో జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు రాజారత్నం నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పోలవరంలో ఎంఎల్ఎ బాలరాజు చేసిందేమీలేదని, ఓటు అడిగే హక్కు వైసిపికి లేదని అన్నారు. జనసేన అభ్యర్థి కూడా పెత్తందారుల చెప్పుచేతల్లో ఉంటారని, ఆయన వల్ల ప్రజలకు ఉపయోగం ఏమీ లేదని వ్యాఖ్యానించారు.

సమస్యల ఊసే కరువు

ఉచితాలే ఏకరువు..!

- ప్రజా సమస్యలపై మాట్లాడని వైసిపి, టిడిపికూటమి అభ్యర్థులు
- రెండు జిల్లాల్లో తాగునీరు, రోడ్లు, నిర్వాసితుల సమస్యలెన్నో తిష్ట
- ఇచ్చిన, ఇవ్వబోయే సంక్షేమ పథకాల చుట్టే ప్రచారమంతా
- ఓట్లు కొనుగోలుపైనే నాయకుల దృష్టంతా

కుక్కునూరు మండలంలో వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ప్రజా సమస్యలపై కాకుండా.. ఇస్తున్న, ఇవ్వబోయే ఉచిత పథకాల చుట్టూనే సాగిస్తున్నారు. తాను గెలిస్తే నియోజకవర్గంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన ప్రజా సమస్యలను పరిష్కారిస్తానంటూ అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎక్కడా ప్రచారంలో మాట్లాడటం లేదు. ప్రజా సమస్యలను మరుగున పెట్టేందుకు ఇతర రాజకీయ అంశాలను తెరపైకి తెస్తున్న పరిస్థితి ఉంది. పోలింగ్‌కు ముందురోజు ఓట్లు కొనుగోలుపైనే నాయకులంతా దృష్టి సారించి ముందుకు సాగుతున్నట్లు కన్పిస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం అలానే ఉన్నాయి. వీటిలో తాగునీరు ప్రధానమైంది. దాదాపు 39 లక్షల మంది ప్రజానీకం సమస్య ఇది. పదేళ్లుగా తాగునీటి సమస్యకు పాలకులు పరిష్కారం చూపలేకపోయారు. ఆక్వా చెరువులతో తాగునీటి వనరులన్నీ కలుషితమై సొమ్ము చెల్లించి కొనుగోలు చేసే తప్ప దాహం తీరని పరిస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు. తాగునీటికి సంబంధించిన సమస్యను ఏవిధంగా పరిష్కరిస్తారు, ఎప్పటికి పరిష్కరిస్తారు..అనేది ఏ ఒక్క నాయకుడు మాట్లాడటం లేదు. గడిచిన పదేళ్లుగా జనం ఎదుర్కొంటున్న మరో సమస్య అధ్వాన రోడ్లు. రెండు జిల్లాల్లో మూడు వేలకుపైగా కిలోమీటర్ల మేర ఉన్న ఆర్అండ్‌బి రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. జనాలు ప్రయాణించలేని స్థితికి చేరాయి. గత టిడిపి ప్రభుత్వంలోగాని, ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలోగాని రోడ్ల గురించి పట్టించుకున్న నాథుడే లేకుండాపోయాడు. నిన్నటి వరకూ రోడ్ల గురించి తెగ ఉద్యమాలు చేసిన ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు కూడా ఎన్నికల ప్రచారంలో నోరువిప్పడం లేదు. నియోజకవర్గాల్లో దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిపై ఎన్నికల ప్రచారంలో మాట్లాడటం లేదు. నరసాపురం ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్, వశిష్ట గోదావరిపై వంతెన నిర్మాణం వంటి సమస్యల గురించి ఎన్నికల బరిలో ఉన్న నాయకుల మాటల్లో ప్రస్తావనకు రావడం లేదు. పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ నిర్మిస్తామని చెప్పారు. పాలకొల్లు సమీపంలోని దగ్గులూరులో మెడికల్ కాలేజీ నిర్మాణానికి భూమి కొనుగోలు చేసినట్లు చెప్పినా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. తాము అధికారంలోకి వస్తే మెడికల్ కాలేజీ నిర్మిస్తామంటూ ఏ ఒక్కరూ మాట్లాడటం లేదు. కొల్లేరు ప్రజల సమస్య గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతోంది. మూడో కాంటూరు కుదింపు సంగతిని పక్కన పెట్టేసి, ఎకోసెన్సిటివ్ జోన్‌ను తెరపైకి తెచ్చారు. దీంతో కొల్లేరు ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. కొల్లేరు ప్రజల సమస్యను ఏవిధంగా తీరుస్తారో రాజకీయ పార్టీల నాయకులు నోరువిప్పి మాట్లాడని పరిస్థితి ఉంది.

బాధితుల సమస్యలపైనా మౌనమే

పోలవరం నిర్వాసితుల సమస్యపై టిడిపి కూటమి, వైసిపికి చెందిన నాయకులు అసలు మాట్లాడటం లేదు. పునరావాస ప్యాకేజీ, భూములకు, యువతకు ఇస్తానన్న పరిహారం ఇలా ఎన్నో సమస్యలతో నిర్వాసితులు నలిగిపోతున్నారు. తమను గెలిపిస్తే నిర్వాసితుల సమస్యలను ఎప్పటికి పరిష్కరిస్తారో నాయకులు చెప్పాల్సి ఉంది. దాదాపు 20 వేల కుటుంబాలకు సంబంధించిన సమస్య రాజకీయ నాయకులకు పట్టడం లేదు. చింతలపూడి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న బాధిత రైతులకు పరిహారం సమస్య పదేళ్లుగా సాగుతోంది. ఇప్పటికైనా సమస్యను పరిష్కరిస్తారో, లేదో అర్థం కాని పరిస్థితి ఉంది. ఏలూరులో జ్యూట్‌మిల్లు మూతపడటంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. కార్మికుల ఉపాధికి ఏం చేస్తారో నాయకులు చెప్పాల్సి ఉంది.

ఉచితాలపైనే ఫోకస్.. ఓట్ల కొనుగోలుకు ప్రణాళికలు

రాజకీయ పార్టీల అభ్యర్థులంతా ఎన్నికల ప్రచారంలో ఉచిత పథకాలపైనే పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులైతే ఇస్తున్న పథకాలపైన, ప్రతిపక్ష నేతలైతే ఇవ్వబోయే పథకాలపైనే ఫోకస్ పెడుతూ ముందుకు సాగుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించడం లేదు. ఇప్పటికే ఓటర్లు ప్రలోభాలపెట్టేందుకు రకరకాల గిఫ్టులు ఇస్తున్న అభ్యర్థులు, పోలింగ్ ముందురోజు ఓట్ల కొనుగోలుపైనే ప్రధానంగా దృష్టి సారించిన పరిస్థితి ఉంది. ఓటుకు ఎంత పంపిణీ చేయాలి. ఏవిధంగా చేయాలి. ఎంతమందిని నియమించుకోవాలో వారికి డబ్బు పంపకాల ప్రణాళికలు రూపొందించే పనిలో తలమునకలయ్యారు.

పోలింగ్ సిబ్బంది తొలి విడత ర్యాండమైజేషన్

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ఎన్ఐసి రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఉపయోగిస్తూ ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ గురువారం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు తొలి ర్యాండమైజేషన్‌లో పిఒ, ఎపిఒ, ఒపిఒలకు విధుల కేటాయింపులో భాగంగా సంబంధిత నియోజకవర్గాలవారీగా శిక్షణ నిమిత్తం గుర్తించారు. జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1750 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మొత్తం 11,798 మందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అందులో 2,150 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2150 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 7,498 మంది ఇతర పోలింగ్ అధికారులు ఉన్నారు. ప్రతి టీమ్‌లో ఒక పిఒ, ఒక ఎపిఒ, ఇతర పోలింగ్ అధికారులు ఉంటారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 25 శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్ఒ డి.పుష్పమణి, ఎన్ఐసి అధికారి శర్మ, డిఇఒ సి.అబ్రహం, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏలూరు అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లలో భాగంగా గురువారం ఏలూరులోని కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా ఎన్నికల సామగ్రిని పంపిణీకి అవసరమైన స్టాల్స్‌ను, బస్సు రూట్లను, ఎన్నికల సిబ్బందికి ఫుడ్ కోర్టును, ఇవిఎంలను భద్రపర్చే స్ట్రాంగ్‌రూమ్‌లను వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లకు సంబంధించి ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిఎస్‌పి శ్రీనివాసరావు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ పంపిణీలో ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా ముందునుంచే పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, కళాశాల ఆవరణంతా పరిశుభ్రం చేయించి, లెవెలింగ్ పనులు చేపట్టాలని అన్నారు. తరగతి గదుల్లో ఉన్న సామగ్రిని వేరేచోటికి తరలించి గదులను సిద్ధంగా ఉంచాలని, విద్యుత్, తాగునీరు, బారికేడ్లు, షామియానాలు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లలో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పనులు ప్రారంభించాలని ఏలూరు రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి, నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో ఇంటర్ డిఇసి బి.ప్రభాకరరావు, తహశీల్దార్ వి.మురార్జీ, మండల సర్వేయర్, ఇతర కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల రూ.3 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని వేగవరం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా ఎటువంటి ఆధారాలూ లేని రూ.లక్ష నగదును అధికారులు సీజ్ చేశారు. జంగారెడ్డిగూడెం నుంచి అశ్వారావుపేట వైపు వెళ్తున్న స్కూటీలో ఈ సొమ్ము గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు.

భీమడోలు: ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ భీమడోలు బృందం గురువారం సాయంత్రం నిర్వహించిన తనిఖీల్లో రూ.రెండు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు బృందం అధికారి ఎ.మాధవరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పొలసానిపల్లికి చెందిన కాలి రవికుమార్ సరైన పత్రాలు లేకుండా రూ.రెండు లక్షల నగదుతో భీమడోలు నుంచి తిరుమలంపాలెం కారులో వెళ్తుండగా పొలసానిపల్లి-ద్వారకాతిరుమల రాష్ట్రీయ రహదారిపై ఫ్లయ్ ఓవర్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో పట్టుకుని సొమ్ము స్వాధీనం చేసుకున్నామని, ట్రెజరీలో డిపాజిట్ చేశామని తెలిపారు.

పట్టుబడిన నగదుతో అధికారులు

పింఛన్ కోసం వెళ్తుంటే..!

అస్వస్థతకు గురై వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - చాట్రాయి

పెన్షన్ కోసం సచివాలయానికి వెళ్తూ ఎండ తీవ్రతకు మార్గమధ్యంలోనే అస్వస్థతకు గురై వృద్ధుడు మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా చాట్రాయి మండలంలోని చీపురుగూడెంలో గురువారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మేకల తిరుపతయ్య (85) పింఛన్ కోసం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుంచి కాలి నడకన అరకిలోమీటరు దూరంలో ఉన్న సచివాలయానికి బయల్దేరాడు. రామాలయం సెంటర్‌కు వచ్చేసరికి తిరుపతయ్య కుప్పకూలాడు. గమనించిన స్థానికులు సపర్యలు చేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అపస్మారక స్థితిలో ఉన్న తిరుపతయ్యను ఇంటికి తీసుకెళ్లి ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా ప్రాణం కోల్పోయాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు పింఛనుదారుల మృతి

ఉంగుటూరు: కైకరంలో ముగ్గురు పింఛనుదారులు అనారోగ్య కారణాలతో మృతి చెందడం చర్చనీయాంశమైంది. ముగ్గురిలో ఒక మహిళ రెండు వారాలుగా విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మరో వృద్ధుడు బుధవారం మధ్యాహ్నం పింఛను కోసం ఇంటి నుంచి బయల్దేరి మార్గమధ్యంలో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయినట్లు విఆర్ఒ-1 భీమవరపు నాగేశ్వరరావు వెల్లడించారు. మరో వృద్ధురాలు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఇంటి వద్దే మృతి చెందారు.

పెన్షన్‌దారులను వీడని అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో రెండో రోజు గురువారం కూడా పెన్షన్‌దారులు పింఛన్ సొమ్ము నానావస్థలు పడ్డారు. గురువారం ఉదయం 11:30 గంటల తర్వాత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అన్ని సచివాలయాల్లో ప్రారంభమైంది. రెండో రోజు పెన్షన్ తీసుకునేందుకు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు రావడంతో సచివాలయాల ప్రాంతమంతా కిటకిటలాడాయి. పెన్షన్లు 87 శాతం పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ ఎన్ఎం.గంగాధర్‌రావు తెలిపారు. ఇంకా 13 శాతం మంది లబ్ధిదారులకు పెన్షన్ అందాల్సి ఉందన్నారు.



పెయ్యేరు సచివాలయం వద్ద పింఛనుదారులు

90 శాతం పింఛన్ల పంపిణీ

2,43,795 మందికి రూ.73.89 కోట్లు

డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 2,70,804 మంది లబ్ధిదారులకుగాను గురువారం రాత్రి 8 గంటల వరకు 2,43,795 మందికి సామాజిక పెన్షన్లు పంపిణీ చేసినట్లు డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు వెల్లడించారు. పెన్షన్ల పంపిణీ నిమిత్తం రూ.80.92 కోట్లు విడుదలవ్వగా ఇంతవరకు రూ.73.89 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయిగూడెం మండలం దొరమామిడి, అంకంపాలెంలో పోలవరం డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డి, జీలుగుమిల్లి సిఐ టి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం ఎస్ఐ కె.వెంకన్న, సిబ్బంది, కేంద్ర బలగాలు దొరమామిడి, అంకంపాలెం గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకన్న మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు తమ ఓటు హక్కుని నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు.

ఆశలన్నీ ఆవిరి..!

లారీ ఢీకొని దంపతులు దుర్మరణం

కన్నీరుమున్నీరైన కుమారుడు, కుమార్తె

ఇసురు మాధవరెడ్డి, కృష్ణవేణి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - పెనుగొండ

బంధువుల ఇంట వివాహానికి వెళ్లారు. ఆనందంగా గడిపి త్వరలోనే తమ ఇంట కూడా పెళ్లి భాజాలు మోగించాలనే ఆలోచనలతో ఇంటికి వెనుదిరిగారు. అయితే వారి ఆశలు, ఆలోచనలు సాకారం కాకుండానే లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు కబళించింది. దీంతో పెనుగొండలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం ప్రాంతానికి చెందిన ఇసురు మాధవరెడ్డి (50), కృష్ణవేణి (39) దంపతులు 15 ఏళ్ల క్రితం వ్యాపారం రీత్యా పెనుగొండ వచ్చి స్థిరపడ్డారు. మాధవరెడ్డి పాత ప్లాస్టిక్ సామగ్రితో పైపులు తయారు చేసే చిన్నపాటి పరిశ్రమ నడుపుతున్నాడు. వీరి కుమారుడు ఇంజినీరింగ్ పూర్తి చేసి తండ్రికి సహాయకారిగా ఉంటుండగా కుమార్తె ఇంజినీరింగ్ చదువుతోంది. పెనుగొండలో అందరికీ సన్నిహితంగా ఉండే మాధవరెడ్డి ఇటీవలే కొత్త ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు సమాచారం. ఇంటి నిర్మాణం పూర్తవ్వగానే కుమార్తె, కుమారులకు వివాహాలు చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఈ దంపతులు బుధవారం రాత్రి పాలకొల్లులో జరిగిన ఒక వివాహానికి హాజరయ్యారు. అనంతరం మోటారు సైకిల్‌పై పెనుగొండ బయల్దేరారు. వీరు పోడూరు మండలం జగన్నాధపురం వచ్చేసరికి వెనుక నుంచి లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణవేణి అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాల పాలైన మాధవరెడ్డి పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. దీంతో పెనుగొండలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల నిమిత్తం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం తరలించారు. పోడూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించొద్దు

ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా రాజకీయ నేతలు నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో ప్రచారం చేసుకోవాలని జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి అన్నారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో శాంతిభద్రతలు, ఎన్నికల నిర్వహణపై సిబ్బందితో గురువారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఏదైనా పోస్ట్ చేసే ముందు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలన్నారు. ఎన్నికలలో యువత చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఉండి టిడిపి అభ్యర్థిని నేనే

సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సార్వత్రిక ఎన్నికల్లో ఉండి టిడిపి అభ్యర్థిగా కూటమి తనకు అవకాశం ఇచ్చిందని, తానే పోటీలో ఉంటానని ఉండి ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి మంతెన రామరాజు స్పష్టం చేశారు. అభ్యర్థిని మార్చుతారంటూ సాగుతున్న ప్రచారాన్ని పట్టించుకోకుండా కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. గురువారం భీమవరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే డోర్ టు డోర్ ప్రచారంలో భాగంగా తాను 1400 కిలోమీటర్లు తిరిగానన్నారు. తన సతీమణి 100 కిలోమీటర్లు పూర్తి చేశారని, దీంతో 1500 కిలోమీటర్లు పూర్తయ్యిందన్నారు. మాజీ ఎంఎల్ఎ శివరామరాజుకు టిడిపి అధిష్టానం మూడుసార్లు అవకాశం ఇచ్చిందన్నారు. రెండుసార్లు ఎంఎల్ఎగా గెలిచిన ఆయన మూడోసారి తానే ఎంపీగా పోటీ చేస్తానని కోరడంతో ఎంపీ టిక్కెట్ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి జనసేన నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, బిజెపి నాయకులు రామ్మూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామరాజు

ఇందిరమ్మ కాలనీలో 'మన ఊరికి మన వాసన్న'

గణపవరం :వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధి చూసి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆ పార్టీ ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో గురువారం నిర్వహించిన మన ఊరికి మన వాసన్న కార్యక్రమంలో ఆయన పాల్గొని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకుని రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఇందిరమ్మ కాలనీలో ఉన్న టిడిపి, జనసేన పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరారు. పుప్పాల శ్రీనివాసరావు సమక్షంలో వైసిపిలో చేరిన వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి గణపవరం అధ్యక్షులు రొంగల శ్రీనివాసరావు, మండల కన్వీనర్ దండు రాము, గణపవరం గ్రామం సర్పంచి మోర అలంకారం పాల్గొన్నారు.

నేడు పశ్చిమలో చంద్రబాబు పర్యటన సాగేదిలా

నరసాపురం, పాలకొల్లులో ప్రజాగళం సభలు

ప్రజాశక్తి - నరసాపురం

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల ఐదో తేదీ శుక్రవారం నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. మండలంలోని సీతారామపురం గ్రామంలో స్వర్ణాంధ్ర కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం రెండున్నర గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 2.45 నిమిషాలకు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంటారు. అనంతరం స్టీమర్ రోడ్డులోని కనకదుర్గ ఆర్చి వద్ద మూడు గంటలకు జరిగే ప్రజాగళం బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం 4.45 నిమిషాలకు పాలకొల్లు చేరుకుంటారు. రాత్రికి పాలకొల్లులో బస చేస్తారు. ఇప్పటికే ఏర్పాట్లను నాయకులు పూర్తి చేశారు. హెలీప్యాడ్ పనులను టిడిపి జిల్లా అధ్యకురాలు తోట సీతారామలక్ష్మి, నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పరిశీలించారు.

ప్రజాగళం సభలను విజయవంతం చేయాలి

నరసాపురం, పాలకొల్లులో ప్రజాగళం సభలను విజయవంతం చేయాలని టిడిపి జోన్-2 ఇన్‌ఛార్జి మందలపు రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ.షరీఫ్, నరసాపురం బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. జనసేన అసెంబ్లీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

పనులను పరిశీలిస్తున్న తోట సీతారామలక్ష్మి

పాలకొల్లు: పాలకొల్లులో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రజాగళం సభలో టిడిపి అధినేత చంద్రబాబు ప్రసంగిస్తారని, ఈ సభకు అంతా విచ్చేసి జయప్రదం చేయాలని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. ఆయన గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాంధీబొమ్మల సెంటర్లో సభ జరుగుతుందని, ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లోని హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వరకు రోడ్ షో జరుగుతుందన్నారు. సమావేశంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, జనసేన నాయకులు బోనం చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్న పాఠశాల విద్యార్థినులు

ఘనంగా శ్రీసాయి గీతాంజలి పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలోని శ్రీ సాయి గీతాంజలి ఇంగ్లీష్ మీడియం పాఠశాల తొమ్మిదో వార్షికోత్సవ వేడుకలు కరస్పాండెంట్ వెల్లూరు శివకోటి యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ అలరించారు. నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు.



పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులు

ద్వారకాతిరుమలలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల రూరల్

మండలంలో సాయంత్రం దాదాపు ఐదు గంటల నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది కొనసాగించారు. అప్పటివరకు వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడ్డారు. దానికి తోడు ఎండతీవ్రత అధికంగా ఉండటంతో మరింత ఇబ్బంది గురయ్యారు.



మాట్లాడుతున్న బడేటి చంటి

ఏలూరులో ప్రజా సంకల్పయాత్ర

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు చంద్రబాబుకు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని టిడిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ఏలూరు 24వ డివిజన్లో గురువారం నిర్వహించిన ప్రజా సంకల్పయాత్రలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఏ అవసరమొచ్చినా తన స్థాయిలో తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు నగరంలో గతంలో టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప గడిచిన ఐదేళ్లలో ఎంఎల్ఎ ఆళ్ల నాని చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. 24వ డివిజన్లో రోడ్లన్నీ కీర్తిశేషులు బడేటి బుజ్జి హయాంలోనే వేసినట్లు స్థానికులు తెలుపుతున్నారన్నారు. స్థానిక ప్రజల సమస్యలు పరిష్కరించే విషయంలో కూడా ఆళ్ల నాని దారుణంగా విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

'వాలంటీర్ వ్యవస్థకు టిడిపి వ్యతిరేకం కాదు'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వాలంటీర్ వ్యవస్థ తెలుగుదేశానికి వ్యతిరేకం కాదని, రాజకీయాలు చేసే వాలంటీర్లకు టిడిపి వ్యతిరేకమని, వాలంటీర్లకు తాము అధికారంలోకొచ్చాక తప్పకుండా న్యాయం చేస్తామని టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్కుమార్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాలంటీర్ల రెచ్చగొట్టడం ద్వారా వైసిపి ప్రభుత్వం రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం, ఉంగుటూరు గ్రామాలకు ఈ నెల 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎఇఇ శ్రీరామ్ తెలిపారు. విద్యుత్మార్గం వెంబడి తీగల కింద చెట్ల కొమ్మలు తొలగించే పనుల కారణంగా సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

కొయ్యలగూడెం : మెట్ట మీద ఉన్న 132 కెవి సబ్ స్టేషన్లో మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో ఆ సబ్స్టేషన్ పరిధిలోని కొయ్యలగూడెం సెక్షన్లో ఉన్న అన్ని సబ్స్టేషన్లు, పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఈపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రాధాకృష్ణ తెలిపారు.

నేరాలు - ఘోరాలు

జాతీయ రహదారిపై ప్రమాదం

టిడిపి నేత గంగయ్యతో పాటు మరి కొందరికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పెదపాడు మండల పరిధిలోని తాళ్ళమూడి జాతీయ రహదారిపై గురువారం ఉదయం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ఢీ కొన్నాయి. అదే సమయంలో గన్నవరం విమానాశ్రయం నుంచి దుగ్గిరాల వస్తున్న దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ప్రమాద పరిస్థితిని చూసి తక్షణమే స్పందించారు. హైవే పెట్రోలింగ్ టీమ్తో చర్చించి ఘటనా వివరాలు ఆరా తీశారు. ఈ ప్రమాద ఘటనలో స్వల్పంగా గాయపడిన పెదవేగి మండలం కవ్వగుంటకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు సుగ్గిసాని గంగయ్య సహా ఇతరులను పరామర్శించారు. తక్షణమే మెరుగైన సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని హైవే పెట్రోలింగ్ సిబ్బందికి చింతమనేని సూచించారు. గాయాలపాలైన వారిని హైవే అంబులెన్స్లో ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ప్రమాద ఘటనను చూసి తక్షణమే స్పందించిన చింతమనేని ప్రభాకర్కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

లారీ బీభత్సం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ఎంఆర్.అప్పారావు కాలనీలో ప్రధాన రహదారి పక్కన గురువారం లారీ అదుపుతప్పి మోడల్ డెయిరీలోకి దూసుకెళ్లింది. వరంగల్ నుంచి హనుమాన్ జంక్షన్ వైపు వెళ్తున్న లోడుతో వెళ్తున్న లారీ రోడ్డు పక్కన మార్జిన్ దాటి మోడల్ డెయిరీలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రెండు బైకులు ధ్వంసమయ్యాయి. వాహనదారులు పక్కకు తప్పుకుని ప్రాణాలను కాపాడుకున్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలవ్వలేదు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద గురువారం సాయంత్రం ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఓ వ్యక్తి సంచిలో 9.5 లీటర్ల నాటు సారాను ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. నాటు సారాను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సిపిఎం నేత రాజారావుకు మాతృవియోగం

ప్రజాశక్తి - చాట్రాయి

అనసూయ (ఫైల్)

మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు చాగంటి రాజారావు మాతృమూర్తి అనసూయ బుధవారం సాయంత్రం మృతి చెందారు. ఆమె భర్త చాగంటి పాపయ్య గతంలో మృతి చెందారు. వీరికి ఆరుగురు కుమారులు ఉన్నారు. వారిలో చాగంటి రాజారావు ఒకరు. అనసూయ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతి వార్త తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఎం మండల కమిటీ సభ్యులు కొమ్ము ఆనందం, సిఐటియు నాయకులు టిఎస్ఎం.సూరి, సిపిఎం మండల కమిటీ సభ్యులు గజివెల్లి వెంకటేశ్వరరావు, చాగంటి రాజారావు గృహానికి వెళ్లి ఆమె మృతికి సంతాపం తెలిపారు.

కొనసాగిన 'పది' మూల్యాంకనం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పదో తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం గురువారం నాలుగో రోజు 56.21 శాతానికి చేరుకుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. నగరంలోని సెంట్ జెవియర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల పేపర్ల మూల్యాంకనం నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మూల్యాంకనం నిర్వహించనున్నట్లు తెలిపారు. సిబ్బంది 1020 మంది హాజరయ్యారని, ఎటువంటి ఇబ్బంది లేకుండా మూల్యాంకనం ప్రశాంతంగా జరిగిందని విద్యాశాఖాధికారి అబ్రహం తెలిపారు.

'సూపర్ సిక్స్ పథకాలతో ఎంతో లబ్ధి'

ప్రజాశక్తి - ముసునూరు

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు ఎంతో లబ్ధి పొందుతారని లోపూడి శివారు బస్వావరప్పాడు గ్రామానికి చెందిన ఎంపిటిసి సభ్యులు వేంపాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లోపూడి, బస్వావరప్పాడు గ్రామాల్లో టిడిపి ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు శ్రీనివాసరావు గురువారం పర్యటించి సూపర్ సిక్స్ పథకాలను గ్రామస్తులకు వివరించారు.



వినతిపత్రం అందిస్తున్న టిడిపి నేతలు

ఇంటి వద్దే పింఛన్లు అందించాలని వినతి

ప్రజాశక్తి - చాట్రాయి

వృద్ధులు, వికలాంగులు, ఇతర పెన్షన్ లబ్ధిదారులకు ఇంటి వద్దే పెన్షన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని, వాలంటీర్లకు బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టిడిపి నేతలు కోరారు. ఈ మేరకు ఎంపిడిఒకు గురువారం వినతిపత్రం అందించారు. టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి, ఆ పార్టీ మండలాధ్యక్షురాలు వరలక్ష్మి, పార్టీ పార్లమెంట్ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగు జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షులు మరిడి చిట్టిబాబు, టిడిపి సీనియర్ నాయకులు పుచ్చకాయ నోబుల్రెడ్డి, కంచర్ల హనుమంతరావు, చల్లగుళ్ల రాజారత్నం అందించారు. ఈ సందర్భంగా కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పింఛన్ల పంపిణీపై వైసిపి ప్రభుత్వం కేవలం రాజకీయ లబ్ధి కోసమే దురుద్దేశపూర్వకంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది వాలంటీర్లు ఎన్నికల కోడ్ అమలులో ఉండగా యథేచ్ఛగా ఉల్లంఘించి వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం స్వార్థ రాజకీయం వల్ల మండుటెండల్లో వయోవృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శుల సేవలను వినియోగించుకుని లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే యుద్ధ ప్రాతిపదికన పింఛన్లు అందించాలని కోరారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని లక్కవరం గ్రామంలో వైసిపి కార్యకర్తలు టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్కుమార్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వారికి రోషన్కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు సాయల సత్యనారాయణ, పెనుమర్తి రామ్కుమార్, లక్ష్మణరావు, జనసేన పార్టీ గ్రామ నాయకులు బండారు సురేష్ పాల్గొన్నారు.

'సంక్షేమం, అభివృద్ధే వైసిపి ధ్యేయం'

ప్రజాశక్తి - చింతలపూడి

అధికారంలోకొచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి రెండు కళ్లుగా సంక్షేమ పథకాలు పేదల ఇంటి వద్దకే చేర్చిన ఘనత సిఎం జగన్కే దక్కుతుందని వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. మండలంలోని మల్లయగూడెం, పోతునూరు, శివపురం, యండపల్లి, మల్లేశ్వరం గ్రామాల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ మళ్లీ సిఎం కావాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, పరిపాలనంతా పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి మాట్లాడుతూ వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజును, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్కుమార్యాదవ్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ రాంబాబు, పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, వెంప కృష్ణ, మిర్యాల దిలీప్, రాజు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గుడిపాడు గ్రామంలో శ్రీ పాండువుల సమేత శ్రీ కృష్ణ దేవస్థాన ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా పంచ పాండువులు విగ్రహాలు ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్యాదవ్ పాల్గొన్నారు. ఆయనతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు 15 వరకూ అవకాశం

ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి ఎస్కెఎన్.ఖాజావలీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఓటు హక్కు పొందేందుకు ఏప్రిల్ 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండినవారంతా అర్హులేనని, ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి ఎస్కెఎన్.ఖాజావలీ చెప్పారు. ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండినవారంతా అర్హులేనని, ప్రస్తుతానికి ఇదే చివరి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. దేశంలో 18 ఏళ్లు దాటిన భారత పౌరులందరికీ మన రాజ్యాంగం ఓటుహక్కు కల్పిస్తుందన్నారు. వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లభిస్తుందని చెప్పారు. ఆ తరువాత ధరఖాస్తు చేసినా, ఈ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం ఉండదన్నారు. కొత్త ఓటు కోసం, లేదా చిరునామా మార్పు కోసం ఈ నెల 15వ తేదీ లోపల వచ్చే ధరఖాస్తులను మాత్రమే పరిశీలించనున్నట్లు చెప్పారు. వాటిని పదిరోజుల్లోగా పరిశీలించి, అర్హత ఉంటే ఓటర్ల జాబితాలో చేర్చనున్నట్లు తెలిపారు. వీరికి మే 13న జరిగే ఎన్నికల్లో ఓటువేసే అవకాశం లభిస్తుందన్నారుర. ఏప్రిల్ 15వ తేదీ తరువాత వచ్చే దరఖాస్తులను మాత్రం ఎన్నికల తర్వాత మాత్రమే పరిశీలించనున్నట్లు చెప్పారు. వాస్తవానికి నామినేషన్లను దాఖలు చేసేవరకూ ఓటు నమోదుకు ధరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, అయితే వచ్చిన వాటిని పరిశీలించి జాబితాలో చేర్చటానికి సమయం పడుతుంది కాబట్టి ధరకాస్తు చేసుకోవటానికి చివరి తేదీ ఏప్రిల్ 15 నిర్ణయించారని తెలిపారు.

పలుచోట్ల చెట్లు నరికివేత

ప్రజాశక్తి - కొయ్యలగూడెం



నరికివేసిన చెట్లు

మండలంలోని పొంగుటూరు, కన్నాయగూడెం, యర్రంపేట, ఆరిపాటి దిబ్బలు గ్రామాల్లో పలుచోట్ల చెట్లను విచ్చలవిడిగా నరికి వేస్తున్నారు. కొత్త విద్యుత్ స్తంభాలు వేయడానికి అవి అడ్డంగా ఉన్నాయని, భవిష్యత్తులో విద్యుత్ లైన్కు ఇబ్బంది లేకుండా తొలగిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. వేసవి సమీపించడంతో వేడి ఎక్కువగా ఉండే దారిన వెళ్లే వాహనదారులు కొంతసేపు సేద తీరేందుకు కూడా ఆస్కారం లేకుండా చెట్లు మధ్యకు నరికివేస్తున్నారు. భారీ కొమ్మలతో, పచ్చని ఆకులతో పెరిగిన వృక్షాలను నరికివేస్తుంటే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భారీ వృక్షాలను తప్పించి కరెంట్ పోల్స్ వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముదినేపల్లిలో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - ముదినేపల్లి

కవాతు చేస్తున్న సిఆర్పిఎఫ్ సిబ్బంది

ఎస్పి మేరీ ప్రశాంతి ఉత్తర్వుల మేరకు గురువారం ముదినేపల్లి మండలంలో సిఆర్పిఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు. కైకలూరు రూరల్ సిఐ పర్యవేక్షణలో, ఎస్ఐ డి.వెంకట్కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. మండలంలోని చిగురుకోట, వడాలి, వైవాక గ్రామాల సెంటర్లలో సిఆర్పిఎఫ్ సిబ్బంది రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వచ్ఛందంగా వారి ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటర్లకు మనోధైర్యం కల్పించేందుకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్ కుమార్ మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటును స్వేచ్ఛగా శాంతియుత వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వర్క్షాపునకు హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ఏలూరు పట్టణంలో ఉన్న ఈకో క్లబ్ పాఠశాల విద్యార్థులకు పర్యావరణ విద్యపై అవగాహన కల్పించే నిమిత్తం వర్క్షాపును స్థానిక కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పట్టణంలో ఉన్న వివిధ పాఠశాలలకు చెందిన 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మశ్రీ డాక్టర్ అబ్బారెడ్డి నాగేశ్వరరావు పాల్గొని విద్యార్థినులకు పర్యావరణంలోని వివిధ అంశాలపై సవివరంగా అవగాహన కల్పించారు. వారు తమ ఉపన్యాసంలో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఆహారాన్ని సక్రమంగా వినియోగించాలని, ఆహార వృధాను తగ్గించాలని, పర్యావరణాన్ని రక్షించుకునే బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. భావి భారత పౌరులైన మీరు ఈ విషయంలో తగిన అవగాహన పొంది పర్యావరణ పరిరక్షకులుగా ఎదగాలని చెప్పారు. ఆహార పదార్థాల విషయంలో ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో కూరగాయల మొక్కలను పెంచుకొని వాటిలో సేంద్రీయ ఎరువులను వాడి వాటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. జిల్లా సమన్వయకర్త వెంకటేశ్వరరావు వివిధ పర్యావరణ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రధాన, ద్వితీయ, తృతీయ బహుమతులను డాక్టర్ అబ్బారెడ్డి నాగేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు పర్యావరణహిత మార్పులతో కూడిన జీవన విధానాన్ని పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి కస్తూరిబా బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.సునీత అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు, డివిజనల్ సమన్వయకర్త మధుసూదన్రావు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులను ఆదుకోవాలి

కామవరపుకోట : రంగస్థల కళాకారులకు లబ్ధి చేకూర్చే విధంగా ప్రత్యేక సంక్షేమ పథకాలు రూపొందించి అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ ఎన్నికల ప్రణాళిక రూపొందించాలని ప్రజానాట్యమండలి జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు, జానపద కళాకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్.కృష్ణబాబు, సీనియర్ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ, సీనియర్ కళాకారులు చిలుకూరి సుబ్బయ్యచారి, సబ్బి కనకారావు, విభూది రాజేశ్వరి కోరారు. ఈ మేరకు వారు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రంగస్థలం కళాకారులను ప్రభుత్వాలు ఆదుకోవాలని, ప్రస్తుతం వారికి ఇస్తున్న రూ.3 వేల పెన్షన్ అనారోగ్యంతో ఉన్న వృద్ధ కళాకారులకు కనీస వైద్య ఖర్చులకు కూడా సరిపోవడం లేదన్నారు. వృద్ధ కళాకారులకు కనీసం రూ.ఆరు వేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు.

'మళ్లీ వచ్చేది వైసిపి ప్రభుత్వమే'

ప్రజాశక్తి -ముదినేపల్లి



ప్రచారం చేస్తున్న ఎంఎల్ఎ డివిఆర్ కోడలు స్వాతి

వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలనే కాకుండా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి అన్ని తరగతుల ప్రజల సంక్షేమానికి కృషి చేసిన సిఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని కైకలూరు ఎంఎల్ఎ డివిఎన్ఆర్ కోడలు దూలం స్వాతి అన్నారు. మండలంలోని బొమ్మినంపాడులో వైసిపి శ్రేణులతో కలిసి ఆమె గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్కుమార్యాదవ్ తరపున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, రాచూరి రాధా, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు శీలం రామకృష్ణ, లేళ్ల ఆంజనేయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ముద్దరబోయిన పర్యటన



అభిమానులతో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ముసునూరు

చరిత్రను తిరగరాసేందుకు తన అభిమానులు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని మర్రిబంధం, పల్లెర్లమూడి, అమ్మపాలెం గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. తన అభిమానుల ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ స్థానికులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర అభ్యర్థిగా 2004లో గన్నవరం నుంచి తాను విజయం సాధించానన్నారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు వైఎస్ఆర్ గాలిలో కూడా రాష్ట్రవ్యాప్తంగా స్వతంత్ర అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రాలేదని, ఆనాడు గన్నవరం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా తాను మాత్రమే గెలిచానని చెప్పారు. అందుకు కారణం తన అభిమానులేనన్నారు. 2014, 2019 ఎన్నికల్లో నాయకులను నమ్ముకుని ఎన్నికల్లో దిగానని ఫలితంగా ఓటమి చెందానన్నారు. ఆ నాయకుల తీరును తన కార్యకర్తలే బహిర్గతం చేశారని, పార్టీ టికెట్టు నిరాకరించినా కార్యకర్తల అభీష్టం మేరకు తాను స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల రంగంలో నిలుస్తున్నానన్నారు. 2024లో చరిత్ర పునరావృతం అవుతుందని నమ్మకం ఉందన్నారు. నూజివీడు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి, ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటి సరఫరా, పక్కా డ్రెయినేజీల నిర్మాణం వంటివి రెండేళ్లలో పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మద్యం రవాణాపై నిఘా

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఎన్నికల నేపథ్యంలో సారా, అక్రమ మద్యం కేసులకు సంబంధించి కఠినంగా వ్యవహరిస్తున్నట్లు బ్యూరో సిఐ పి.వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ మార్చి 16వ తేదీ నుంచి 54 కేసుల్లో 41 మందిని అరెస్ట్ చేశామన్నారు. ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్రమ మద్యం విక్రయాలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మహారాజశ్రీ తణుకు 2వ అదనపు జూనియరు సివిలు జడ్జి వారి కోర్టులో
O.S. No. 114/2021

Between:
Canara (erstwhile Syndicate) Bank, Tanuku, rep. by its Manager. -వాది
AND
Buddiga Sridevi, W/o. Ramachandra Rao, 55 years, Kolla vari Street, Pydiparru, Tanuku Municipality.
-ప్రతివాది

వాది పై నెంబరు దావా ప్రతివాదిపై **Rs. 10,08,474-89** పైసలు దర్మిలా వడ్డీ మరియు దావా ఖర్చులు రాబట్టు నిమిత్తము దాఖలు చేసియున్నారు. సదరు దావా ప్రతివాది యొక్క హాజరు నిమిత్తము ది. 03-05-2024న వాయిదా అయి ఉన్నది. ప్రతివాది **ది. 03-05-2024న ఉదయం గం॥ 10.30 ని॥లు** లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరయి, తన యొక్క ఆక్షేపణలు దాఖలు చేసుకోవలసి యున్నది. ఇందుకు తప్పే యెడల పై నెంబరు దావా ప్రతివాది యొక్క పరోక్షమందు తీర్మానింపబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది.

సి.యస్.వి.యస్.బుస్సీ
తణుకు వాది తరపు న్యాయవాది
ది.03-4-24 తణుకు, సెల్: 9989567750

In the Court of the Hon'ble Addl. Senior Civil Judge, Eluru
E.P. No. 322/2011 in O.S. No. 348/2007

Between:
Golla Yalamanda Rao ...*DHR/Plaintiff*
AND
Sri Lanka Srinivasa Rao and another
...*JDR's/ Defendants*

పై నంబరు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు కొరకు JDRs/ ప్రతివాదులు యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములు గల ఈక్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 19-04-2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. యావన్మంది వేలం పాటలో పాల్గొని పాడుకోవచ్చును. కోర్టు వారి షరతులు వర్తించును.

షెడ్యూలు ఆస్తి వివరము: పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు సబ్ రిజిస్ట్రారు యిలాకా, ఏలూరు నగరం T.S. No. 1572, పాత అసెస్మెంట్ నెంబరు 3294, దాఖలా చ॥గ॥లు 130, అందులో గల పెంకుటిల్లు నెం. 3బి-3-8 కు హద్దులు.
దక్షిణం: శ్రీ వేంకటేశ్వరస్వామి గుడి తాలూకా ఆస్తి.
తూర్పు: డి.మధుసూదనరావు ఆస్తి.
పడమర: మునిసిపల్ బజారు.
ఉత్తరం: ఆర్.లక్ష్మణరావు ఆస్తి.
ఈ హద్దుల మధ్య సుమారు 130 చ॥గ॥ల ఇంటి స్థలం, అందలి పెంకుటిల్లుతో సహా వేలం వేయుదురు.

DHR విలువ: రూ. 2,00,000/-
అమీనా విలువ: రూ. 7,50,000/-

ఈడ్పుగంటి శ్రీనివాసబాబు
అట్లూరి రవికుమార్
ఏలూరు
ది.02-4-2024 అడ్వకేట్స్, ఏలూరు

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా
ఓ.ఎస్. నెం. 74/2023

బిట్వీన్:
బాల వెంకట సుబ్బారావు -ప్లెయింటిఫ్
మరియు
శ్రీమతి పూరకరణం సీతాదేవి & 6 Others
-డిఫెండెంట్స్

టు:
6వ రెస్పాండెంట్: పూరకరణం నిఖిత, తండ్రి: లేటు జగన్ మోహనరావు, స్త్రీ, వయస్సు 26 సం॥లు, అడ్రస్: ఫ్లాట్ నెం. 303, గణేష్ ఉమశ్రీ అపార్ట్మెంట్, 3వ అంతస్తు, దొంగల మండపం దగ్గర, ఏలూరు, ఏలూరు జిల్లా.

పై నెంబర్ గ్రంధములో మీరు 6వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పత్రిక ముఖముగా తెలియజేయునది ఏమనగా, **ది. 24-04-2024వ తేదీన** పై నెంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారి ఎదుట మీ హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల సదరు పై నెంబర్ గ్రంధములో మీయొక్క పరోక్షముగా విచారించబడును.

మాగంటి లక్ష్మణ్కుమార్
కె.వి.ఎస్.సోమయాజి
న్యాయవాదులు, ఏలూరు, సెల్: 9885279889

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా
ఓ.ఎస్. నెం. 74/2023

బిట్వీన్:
బాల వెంకట సుబ్బారావు -ప్లెయింటిఫ్
మరియు
శ్రీమతి పూరకరణం సీతాదేవి & 6 Others
-డిఫెండెంట్స్

టు:
1వ రెస్పాండెంట్: శ్రీమతి పూరకరణం సీతాదేవి, భర్త: లేటు రామారావు, స్త్రీ, వయస్సు 82 సం॥లు, అడ్రస్: C/o. మాధవరావు, ఎన్.కాళేశ్వరరావు ఇల్లు, కింది అంతస్తు, తూర్పు ద్వారం, గాంధీ మైదానం దగ్గర, పశ్చిమ వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా.

పై నెంబర్ గ్రంధములో మీరు 1వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పత్రిక ముఖముగా తెలియజేయునది ఏమనగా, **ది. 24-04-2024వ తేదీన** పై నెంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారి ఎదుట మీ హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల సదరు పై నెంబర్ గ్రంధములో మీయొక్క పరోక్షముగా విచారించబడును.

మాగంటి లక్ష్మణ్కుమార్
కె.వి.ఎస్.సోమయాజి
న్యాయవాదులు, ఏలూరు, సెల్: 9885279889